క్లుప్తంగా

బీథర్మల్ విస్తరణ జరిగే వరకూ పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రామగుండం: బీథర్మల్ విద్యుత్ కేంద్రం విస్తరణ జరిపే వరకూ పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి అన్నారు. పట్టణంలోని బీ థర్మల్ విద్యుత్ కేంద్రం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 62.5 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని 800 మెగావాట్ల రెండు కొత్త యూనిట్లను ఏర్పాటు చేయాలని చెప్పి ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రామగుండం జెన్‌కో విద్యుత్ కేంద్రం విస్తరణ కోసం సాధించుకున్న నిధులను స్వార్థపూరితంగా యాదాద్రికి తరలించారని ఆరోపించారు. స్థానిక మంత్రి, ఎమ్మెల్యే స్పందించి ఇక్కడే విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ కౌశిక లత, నాయకులు మహావాది రామన్న, మారం వెంకటేశ్, మద్దికుంట శంకర్, పున్నం శశికుమార్, కుక్క గంగాప్రసాద్, దారంగుల కుమార్, నిమ్మరాజుల రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే విజేతలకు అభినందన



అభినందిస్తున్న టూటౌన్ సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటేలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ బుధవారం అభినందించారు. 15, 16న హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కేజీబీవీ పాలకుర్తి విద్యార్థులు మెడల్స్ సాధించారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో కేరళలో నిర్వహించే సౌత్ ఇండియా కరాటే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని మాస్టర్ రామస్వామి తెలిపారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప, పీఈటీ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాములు

కమాన్‌పూర్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్లకు ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చెప్పాలని లేదా ఆధార్, బ్యాంకు ఖాతాల నెంబర్ చెప్పాలని అడిగినప్పుడు చెప్పకూడదని ఓటీపీ, ఖాతా నంబర్లు ఏ బ్యాంకు వాళ్లు కూడా అడగరని వివరించారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై వీరస్వామిగౌడ్, హెడ్ కానిస్టేబుల్స్ రహీం, తిరుపతి పటేల్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న శాస్త్రినగర్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ, హాస్టల్‌లో పీహెచ్‌సీ డాక్టర్ సృజన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు రకాల మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్ శ్రీజ, సూపర్‌వైజర్లు వెంకటరెడ్డి, సౌందర్య, విజయలక్ష్మి, ఎల్‌టీ షాకీర్, ఏఎన్ఎం శారద ఉన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత



పాలకుర్తి: బసంత్‌నగర్ విమానాశ్రయ సమీపంలోని కురుమపల్లి గ్రామ కూడలి వద్ద మండల ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను బుధవారం బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ పూడ్చి వేయించారు. మండల పరిధిలోని గ్రామాల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే చందర్ మార్గమధ్యంలో కురుమపల్లి గ్రామం వద్ద గల గుంతలను చూసి వెంటనే పూడ్చి వేయించాలని సూచించారు. ఎస్సై పోలీస్ సిబ్బంది సాయంతో స్థానిక కంకర క్రషర్ల నుంచి డస్ట్, కంకర మిక్సింగ్ తీసుకొచ్చి గుంతల్లో పూడ్చి ట్రాక్టర్‌తో చదును చేయించారు.

చిత్ర కథ



పందుల స్వైరవిహారం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్, లక్ష్మీపురం గ్రామాల్లో పందులు స్వైర విహారం చేయడంతో ప్రజలు డెంగ్యూ జ్వరాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్తను తొలగించపోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. డివిజన్‌లో ప్రజలు విష జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చిత్తడిగా మారిన రహదారి

ఓదెల: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఓదెల రైల్వేస్టేషన్ వెళ్లే రహదారి చిత్తడిగా మారింది. ఓదెల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కడానికి వెళ్లే ప్రయాణికులు రహదారి వర్షంనీటితో బురదమయమైంది. రోడ్డు గుంతలతో బురదతో నిండటంతో రైల్వేస్టేషన్‌లో దిగిన ప్రయాణికులు పొత్కపల్లి, కొమిర, ఓదెలకు వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. రైల్వేశాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



మానవహారంగా ఏర్పడిన కార్మికులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు రోడ్‌లోని నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం మానవహారం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ వేతన ఒప్పందకాలం పరిమితి ముగిసి 11నెలలు కావస్తున్నా యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చించి వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమని వాపోయారు. కార్మిక సంఘాల నాయకులు ఇజ్జగిరి భూమయ్య, చిలుక శంకర్, నాంసాని శంకర్, రాజమల్లయ్య, శంకర్, శ్రీనివాస్, సత్యం, నాగభూషణం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలవ్యాప్తంగా భారీ వర్షం



జూలపల్లిలో కురుస్తున్న వర్షం



ఖాజీపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. జూలపల్లిలో మధ్యాహ్నం భారీ వర్షం కురవగా స్థానికంగా ప్రవహించే హుస్సేన్‌మియా జలకళ సంతరించుకుంది. మండలంలో జూలై 1 నుంచి 19 వరకు 17సెం.మీ వర్షపాతం నమోదైంది.

ఓదెలలో ఎడతెరిపిలేని వర్షం

ఓదెల: ఓదెల మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరినాట్లు ముమ్మరం అయ్యాయి. బుధవారం ఉదయం నుంచి వర్షం కురవడంతో మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, గుంపుల, హరిపురం, ఉప్పరపల్లె గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి.

జలమయమైన రోడ్లు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీరు రోడ్లపై నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. గ్రామంలో సైడ్ డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సైడ్ డ్రైనేజీలు నిర్మించాలని ఖాజీపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

దోస్తు కుటుంబానికి ఆపన్నహస్తం

కోల్‌సిటీ: గోదావరిఖనిలో తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అకాల మరణం చెందడంతో.. తోటి మిత్రులు మృతుని కుటుంబానికి అండగా నిలిచారు. వారు సేకరించిన రూ.1.10లక్షల నగదును బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానిక అడ్డగుంటపల్లిలో నివాసం ఉంటున్న జక్కుల తిరుపతి, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 1993లో 10వ తరగతి చదివాడు. ఇటీవల తిరుపతి అకాల మరణం చెందాడు. తిరుపతితో కలిసి చదువుకున్న స్నేహితులు దోస్తు కుటుంబానికి అండగా నిలిచేందుకు సేకరించిన నగదును, మిత్రుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహితులు మాజీ కార్పొరేటర్ వడ్లూరి రవి, ఆసంపల్లి శ్రీనివాస్, రాజ్‌కుమార్, టి.రవి, నగేశ్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు

పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు

పెద్దపల్లిరూరల్: ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సులోపు వారికి అల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృపాబాయితో కలిసి మాట్లాడారు. ఏటా జులై 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రలను అందిస్తారన్నారు. గురువారం నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 2,19,500 మందిని గుర్తించామని, వారందరికీ అందించేందుకు 2,27,300 మాత్రలను సిద్ధంగా ఉంచామన్నారు. సమావేశంలో మాస్‌మీడియా అధికారి వెంకటేశ్వర్లు, టిబి ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి మధుకర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేశ్ తదితరులున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

క్రైం న్యూస్

✦రైలులో బిహార్ ప్రయాణికుడి మృతి

రామగుండం: సికింద్రాబాద్ నుంచి దర్భాంగ వెళ్తున్న రైలులో బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రయాణికుడు మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన కమలేష్‌కుమార్(21) అనారోగ్యం బారిన పడి తన స్వగ్రామమైన నవాడ జిల్లా బర్బోరీకి రైలులో బయల్దేరాడు. రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే బోగీలోనే కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణికుల సమాచారం మేరకు మృతదేహాన్ని రామగుండం రైల్వేస్టేషన్‌లో దింపేశారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి పేర్కొన్నారు.

✦ఎస్సారెస్పీ కెనాల్‌లో జారిపడిన దుప్పి

పెద్దపల్లిరూరల్: గుట్ట ప్రాంతం నుంచి గ్రామంలోకి వచ్చిన ఓ దుప్పిని కుక్కలు తరమడంతో పరిగెత్తుతూ ఎస్సారెస్పీ కాలువలో జారిపడింది. పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దుప్పి కాలువలో పడడాన్ని గమనించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మంగీలాల్ స్థానికుల సహకారంతో దుప్పిని బయటకు తీశారు. గాయాలు కావడంతో కరీంనగర్ జూపార్క్‌కు తరలించారు.

✦గుడుంబా స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీసులు రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకే నగర్‌లో బుధవారం గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. కేకేనగర్‌లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సీఐ వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఎస్సై కళాధర్ రెడ్డి, ఫరీద్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఓ మహిళ ఇంట్లో నిల్వ ఉంచిన గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦దాసరి ఉష జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్: బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష జన్మదిన వేడుకలను పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. రక్తదాన శిబిరం నిర్వహించగా 30మంది యువకులు రక్తదానం చేశారు.

✦ఓదెలలో మడేలయ్య ఉత్సవాలు

ఓదెల: ఓదెలలో మడేలయ్య ఉత్సవాలు బుధవారం ఘనంగ నిర్వహించారు. బోనాలతో మహిళలు ఊరేగింపుగా గుడివరకు వెళ్లి మొక్కులు సమర్పించారు. రజకసంఘం పెద్దలు, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల మహేందర్, డాక్టర్ సతీశ్, మొగిలి పాల్గొన్నారు.

✦జీపీ కార్మికులకు అన్నదానం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి బుధవారం గ్రామ సర్పంచ్ లావణ్య భోజనం ఏర్పాటు చేశారు.

✦మంథనిలో ఫ్రాంకింగ్ సేవలు ప్రారంభం

మంథని: పట్టణంలోని నీలం జిరాక్స్ సెంటర్‌లో మంగళవారం ఫ్రాంకింగ్ సేవలను మంథని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రహమాన్ ప్రారంభించారు.

✦ ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం

గోదావరిఖని: ఇతర పార్టీలతో కుమ్మక్కై కొందరు నాయకులు కోరుకంటి చందర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు పర్లపల్లి రవి, అడ్డాల రామస్వామి, తోడేటి శంకర్‌గౌడ్, దొంతు శ్రీనివాస్, జేవీరాజు విమర్శించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధిష్టానాన్ని మెప్పించుకుని టికెట్ తెచ్చుకుని పోటీ చేయాలే తప్ప పార్టీ అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడిపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్‌లో బుధవారం కాలనీవాసులు బురదరోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. స్థానిక వేంకటేశ్వరకాలనీ ప్రధాన రహదారిపై సీసీరోడ్డు నిర్మించకపోవడంతో బురదమయంగా మారుతోందని వాపోయారు. చిన్న వర్షానికే చిత్తడవుతోందని పాలకులకు, అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా, పట్టించుకున్న నాథుడు లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేస్తూ బురదరోడ్డుపై వరినాట్లు వేసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాత్రివేళలో వీధిలైట్లు లేకపోవడంతో బురదరోడ్డుపై ప్రయాణించే వాళ్లు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. నెలరోజుల్లో స్పందించకుంటే బల్దియా కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తామని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దాసరి ఉమాదేవి, సాంబమూర్తితోపాటు రామారావు, మల్లయ్య, కనకయ్య, విఠల్, శ్రీనివాస్, ఆనంద్, విజయ్, సతీశ్, సర్జిత్ పాల్గొన్నారు.

వ్యాపార కూడళ్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని వ్యాపార కూడళ్లలోని రహదారుల నిర్మాణానికి రూ.4కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే చందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రూ.4కోట్ల నిధులతో లక్ష్మీనగర్‌లోని వ్యాపార కూడళ్లలో బీటీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, అడ్డాల స్వరూప రామస్వామి, కల్వచర్ల కృష్ణవేణి, దొంత శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో ప్రజా చైతన్యయాత్ర

గోదావరిఖని: పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ప్రగతి దశాబ్ది ప్రజా చైతన్యయాత్రను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేకరావు, కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, అడ్డాల స్వరూప, కల్వచర్ల కృష్ణవేణి, దొంత శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, నాయకులు పర్లపెల్లి రవి, తోడేటి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని స్వీపర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయలింగు, సీఐటీయూ నాయకురాలు జ్యోతి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు స్వామి, లక్ష్మి, అనసూయ, వెంకటి, కనకమ్మ, రాజయ్య, కొమురయ్య ఉన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



పెద్దపల్లిరూరల్: అమరవీరుల స్థూపం వద్ద నిరసన



ధర్మారం: నినాదాలు చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులు 14 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగినా పట్టించుకోకుండా ప్రైవేట్ కార్మికులతో పనులు చేయించడం సరికాదని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా అన్నారు. బుధవారం దీక్షా శిబిరం వద్ద మాట్లాడారు. నాయకులు అశోక్, తిరుపతి, రాజయ్య, ముస్తఫా, కనుకయ్య, నరేశ్, రహీం, రాజేశ్వరి, దీపిక, శంకరమ్మ, శారద, శ్రీకాంత్ ఉన్నారు.

'జీపీ కార్మికులపై కక్షసాధింపు తగదు'

ధర్మారం: గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వ కక్షసాధింపు తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్ అన్నారు. వారి డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్మారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించారు. నాయకులు రాజయ్య, శ్రీనివాస్, అశోక్, కనకయ్య, రాజేందర్, నవీన్, మల్లేశం, కొండయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు: జీపీ, ఉద్యోగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజుకు చేరింది. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, తీట్ల శ్రీనివాస్, కవ్వంపల్లి దేవయ్య, కవ్వంపల్లి ఓదెలు, ఇరుగురాల నర్సయ్య, శ్రీనివాస్, మొగిలి, కొండయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కన్నూరి రాంచందర్, కనుకయ్య, వెంకటేశ్, నారాయణ, శంకర్, రాజేశం, మల్లమ్మ పాల్గొన్నారు.

జూలపల్లి: న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో బుధవారం భిక్షాటన చేశారు. దీక్షా శిబిరం నుంచి గ్రామంలోని షాపులు, స్థానిక బస్టాండు వరకు భిక్షాటన నిర్వహించారు. మండల అధ్యక్షుడు పురుషోత్తం, రాంచంద్రం, శంకరయ్య, సత్యం, సంపత్ కుమార్, నాగయ్య, బాణయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో జీపీ కార్మికులు బుధవారం చెవులు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు గట్టయ్య, యూనియన్ నాయకులు గౌసుద్దీన్, లక్ష్మణ్, సంపత్, సురేశ్, అనసూయ, అంజి పాల్గొన్నారు.

ఓదెల: ఓదెలలో పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్మికులు నాగయ్య, క్యాదాసి కుమార్, బ్రహ్మచారి, నరేశ్, శ్రీనివాస్, మల్లేశం ఎల్లయ్య పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తిలో బూడిద రామస్వామి, కట్ల స్వామి, భారతమ్మ, ఆనంద్, సాంబయ్య, శేఖర్, స్వరూప, వెంకటమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

యైటింక్లయిన్‌కాలనీ: అన్ని ఏరియాల సింగరేణి భూ నిర్వాసిత అద్దె వాహనాల బిల్లులను రికవరీ లేకుండా ఇప్పించాలని సింగరేణి భూనిర్వాసితుల వెహికిల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుందిళ్ల నాగరాజు బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌కు వినతి పత్రం అందజేశారు. టి.సమ్మయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఆర్డీఓగా మధుమోహన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా మధుమోహన్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణఖేడ్ ఆర్డీఓగా పనిచేస్తున్న ఆయనను పెద్దపల్లికి బదిలీ చేశారు.

మంథని ఆర్డీవోగా హన్మను

మంథని: మంథని ఆర్డీవోగా వై.హన్మనును నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ ఆర్డీవోగా పనిచేస్తున్న హన్మనుకు బదిలీల్లో భాగంగా మంథని ఆర్డీవోగా పోస్టింగ్ ఇచ్చారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు బయ్యపు మనోహర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కన్నాల, రాణాపూర్ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బసంత్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎమ్మెల్యేగా పోటీచేసే హక్కు ఉందని, రామగుండంలో తమ నాయకుడు మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే టి కెట్ ఆశించడంలో తప్పేంటని ప్రశ్నించారు. తా ము బీఆర్‌ఎస్ నాయకులమేనని, అధిష్టానానికి అనుగుణంగానే పనిచేస్తున్నామన్నారు. పార్టీ నాయకులు శ్రీకాంత్, తిరుపతి, దయానందం, వంశీ, కనుక య్య, ఫయాజ్, అంజి, సమ్మయ్య, కిషన్ పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని బీఎస్పీ నిరసన

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ నుంచి అంతర్గాం మండల కేంద్రానికి వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కాలువ నీటిలో దిగి ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. రహదారి పనులు అసంపూర్ణంగా ఉండటంతో సమీపంలోని ప్రజలతోపాటు ప్రభుత్వ ఐటీఐ, గురుకుల పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అయినా అధికారులు స్పందించకపోడం బాధ్యతారాహిత్యమేనని పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ ఆరోపించారు. రహదారిపై వీధి దీపాలు కూడా లేని పరిస్థితిలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గాం మండల అధ్యక్షుడు చిలుక రామ్మూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు కాసిపేట స్వామి, బీఎస్పీ కార్మిక విభాగం నాయకులు సిరికొండ సది, అడ్లూరి కేశవులు, సాయబోయిన సాయిరాం, ఆవుల మెహర్, గాలిపెల్లి మహేశ్, గొట్టె సాయి, నల్లాల అజయ్, జెల్లంపల్లి వివేక్, మైలారం సిద్దు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అందిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

ఎలిగేడు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి, అతనికి అందజేసినట్లు జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ఎలిగేడుకు చెందిన విష్ణుప్రసాద్ తన ఫోన్‌ను ఎలిగేడు నుంచి జూలపల్లికి వచ్చే మార్గంలో పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి, నాలుగు రోజుల్లో సెల్‌ఫోన్‌ను గుర్తించారు. బుధవారం విష్ణుప్రసాద్‌ను పిలిపించి, ఎస్సై చేతులమీదుగా అందించారు. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సంబంధిత వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.